సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



శంఖు, చక్ర, నామాల ఏర్పాటు

విశాఖ: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శంఖు, చక్ర, నామాలను పునఃప్రతిష్టించారు.



హిందీ దివస్ వేడుకలు

విశాఖ: విశాఖపట్నం పోర్టులో హిందీ దివస్ వేడుకలను సోమవారం డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్‌దూబే ప్రారంభించారు.



ముందుకొచ్చిన సముద్రం

విశాఖ: వాతావరణంలో మార్పులతో సముద్రం 30 అడుగుల ముందుకొచ్చింది. రంగు కూడా మారింది. తీరం కోతకు గురైంది.

క్లుప్తంగా

ఎస్పీ గ్రీవెన్స్‌కు 23 అర్జీలు



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 23 అర్జీలు అందాయి. ఎస్పీ ఎం.దీపిక స్వయంగా అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర అంశాలపై అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

పవన్ పుట్టిన రోజు వేడుకలో బయటపడ్డ విభేదాలు

- కోటవురట్లలో వేర్వేరుగా కార్యక్రమాలు

కోటవురట్ల: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలలో జనసేన పార్టీలోని విభేదాలు బయటపడ్డాయి. తమ పట్టు చూపించుకునేందుకు ఆ పార్టీ నాయకులు గెడ్డం బుజ్జి, బోడపాటి శివదత్ బాహాటంగానే పోటీ పడుతున్నారు. కోటవురట్లలో జనసేనలోని రెండు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యాలయాలను తెరవడమే కాకుండా పుట్టిన రోజు వేడుకలలో కూడా పోటాపోటీగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీలోని వర్గాలు కూడా బయటపడ్డాయి. కొందరు టీడీపీ నాయకులు గెడ్డం బుజ్జి వర్గం వారి కార్యాలయం వద్ద, మరికొంతమంది శివదత్ వర్గం వారి కార్యాలయం వద్ద హాజరై జనసేన నాయకులకు మద్దతు పలికారు. కాగా గెడ్డం బుజ్జి కార్యాలయంలో రక్తదానం చేసిన ఓ యువకుడు అస్వస్థతకు గురికావడంతో అతనికి స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసిన వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న గట్రెడ్డి రాము, శేషగిరిరావు, వాణి

దేవరాపల్లి: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాల ఏర్పాటుకు తోడ్పాటునందించిన పలువురికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కంటి సమస్యలతో బాధపడిన వారికి వైద్య పరీక్షలతో పాటు కంటి ఆపరేషన్లు చేయించడంలో సేవా దృక్పథం కనబరిచిన వేచలం గ్రామానికి చెందిన రెడ్డి శేషగిరిరావు మాష్టారు, వాణి, తిమిరాం గ్రామానికి చెందిన గట్రెడ్డి రాములను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేశారు. ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, ఆస్పత్రి జీఎం రాధాకృష్ణన్ చేతుల మీదుగా సోమవారం విశాఖలోని ఆస్పత్రి ప్రాంగణంలో పురస్కారాలను అందజేశారు.

తోటలో మహిళ అస్థిపంజరం లభ్యం

అనకాపల్లి: కోడూరు పంచాయతీ జీడి మామిడి తోటలో గుర్తు తెలియని మహిళా అస్థిపంజరం ఉన్నట్టు తోట యజమాని రాపర్తి అప్పారావు రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. జీడి మామిడి తోటలో గుర్తుపట్టలేని విధంగా ఉన్న అస్థిపంజరాన్ని తలవెంట్రుకలు ఆధారంగా గుర్తించారు. అనంతరం అస్థిపంజరాన్ని విశాఖ ఫోరెన్సీ ల్యాబ్‌కు పంపించినట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్‌ఐ తెలిపారు.

రెండు వర్గాల మధ్య కొట్లాట

- ముగ్గురికి గాయాలు
- 11 మందిపై కేసు నమోదు

నర్సీపట్నం : ఇన్‌స్టాగామ్‌లో కవ్వింపు చర్యలతో రెండు వర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. టౌన్ ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలివి. మున్సిపాలిటీ పరిధిలోని జోగినాధుని పాలెం, బీసీ కాలనీ ప్రాంతాల్లో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో రమణ, ప్రసాద్, అజయ్ గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మరపురాని మహానేత



అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ సత్యవతి, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య



దేవరాపల్లి : ఎ.కొత్తపల్లిలో డా.వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

- వైఎస్సార్ పాలన ఓ సువర్ణ అధ్యాయం
- రాజన్నకు జిల్లా అంతటా ఘన నివాళి

అనకాపల్లి: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధనకు నేటి యువత కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా ఆధ్వర్యంలో వైఎస్సార్ 15వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి బొడ్డేడ, మాజీ ఎంపీ డాక్టర్ బి.వి. సత్యవతి, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి మృతి చెంది 15 సంవత్సరాలు పూర్తయినప్పటికీ తెలుగువారి గుండెల్లో సజీవంగా ఉన్నారన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకొని, 2004లో అధికారం చేపట్టిన తరువాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అందించిన వైఎస్సార్ పాలన స్వర్ణయుగమన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక మంది నేతలు పాలన సాగించారని, దివంగత రాజశేఖర్‌రెడ్డి అంత గొప్పగా ఎవరూ ప్రజల గురించి ఆలోచించ లేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలాదిమంది రోగులకు కార్పొరేట్ వైద్యం అందిందన్నారు. వైఎస్సార్ మరణవార్త విని 600 మందికి పైగా మృతి చెందారంటే ప్రజల గుండెల్లో ఆయన ఎంతగా కొలువున్నారో అర్థమవుతుందన్నారు. అనంతరం స్థానిక పెరుగబజార్ జంక్షన్, పూడిమడక జాతీయ రహదారిలో దివంగత రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఐడబ్ల్యూఏ రాష్ట్ర మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు, 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, అనకాపల్లి, కశింకోట మండలాల పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

పేద ప్రజల ఆత్మబంధువు

దేవరాపల్లి: సువర్ణపాలన అందించిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచారని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎ.కొత్తపల్లిలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహానేత విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ గంగాభవాని, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, రొంగలి నారాయణమ్మ, సూరినాయుడు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1800-4256018
- జిల్లా స్థాయి టోల్ ఫ్రీ నంబర్ 08924-220228

తుమ్మపాల: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశం నుంచి ఆమె అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఇసుక లభ్యత, పంపిణీ వంటి అంశాలపై మాట్లాడారు. నూతన ఉచిత ఇసుక విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇసుక రవాణాదారులు, మధ్యవర్తులు వసూలు చేసే అధిక రేట్లపై చర్యలకు అధికారులను ఆదేశించారు. నక్కపల్లి డిపోకు సంబంధించి బుకింగ్ సెంటర్‌ను ఎంపీడీవో ఆఫీసులో ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌ఏవోబీకి 3 వేల టన్నుల ఇసుకను కేటాయించామని తెలిపారు. కాంట్రాక్టర్ ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 10 గంటల లోపు లోడింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇసుక వినియోగదారులు నిర్ణీత మొత్తం డిజిటల్ మోడ్‌లో మాత్రమే చెల్లించాలన్నారు. https://www.mines.ap.gov. in/ sand/ వెబ్‌సైట్ ద్వారా ఇసుక లభ్యత వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

'తాండవ' పరిధి గ్రామాల్లో అప్రమత్తం

- ప్రమాదస్థాయి తగ్గే వరకు స్పిల్‌వే గేట్ల ద్వారా నీరు విడుదల

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో ప్రమాద స్థాయి తగ్గే వరకు స్పిల్‌వే గేట్ల ద్వారా నీటిని నదిలోకి విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జలాశయంలో నీటిమట్టం సోమవారం కూడా 378 అడుగులకు తగ్గలేదని, దీంతో స్పిల్‌వే గేట్ల ద్వారా 1250 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నామన్నారు. కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, తాండవ నదిలోకి 35 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఇన్‌ఫ్లో తగ్గేంత వరకు స్పిల్‌వే గేట్ల నుంచి నదిలోకి నీరు విడుదల చేయడం వలన నది పరీవాహక ప్రాంతంలో నివాసం ఉన్న వారంతా నదిలోకి దిగరాదన్నారు. కొయ్యూరు మండలం ఆడాకుల, కృష్టారం, నాతవరం మండలంలో గల జాలారిపేట, చమ్మచింత, పాట్టినాగన్నదొరపాలెం, గుమ్మడిగొండ, పి.జగ్గంపేట, చిక్కుడుపాలెం, గొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, చినగొలుగొండపేట, కోటనందూరు మండలం అల్లిపూడి, లక్ష్మీపురం, కాకరాపల్లి, కోటనందూరు, తుని మండలంలో తాటిపాక, తుని తదితర ప్రాంతాల్లో ప్రజలకు ముందుగా తెలియజేశామన్నారు. రాత్రి సమయంలో ప్రజలతోపాటు పశువులు సైతం నదిలోకి దిగరాదన్నారు. తాండవ ప్రాజెక్టు జేఈలు రామకృష్ణ శ్యామ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై టీడీపీ నాయకుడి రుబాబు

- లంకవానిపాలెం వీఆర్పీపై పెట్టిన అభియోగాలపై విచారణ
- వ్యతిరేకంగా చెప్పలేదని టీడీపీ నేత సోంబాబు వాగ్వాదం



లంకవానిపాలెంలో వీఆర్పీపై విచారణ

కె.కోటపాడు: లంకవానిపాలెం గ్రామ వీఆర్పీ పెనగంటి శ్రీనుపై ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అవుగడ్డ సోంబాబు, మరో 16 మంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధి హామీ పథకం అధికారులు సోమ వారం గ్రామంలో విచారణ నిర్వహించారు. ఫిర్యాదు ఇచ్చిన 16 మందిలో ఐదుగురు విచారణకు హాజరుకాలేదు. స్థానిక రామాలయం వద్ద నిర్వహించిన విచారణలో వీఆర్పీ శ్రీను విధుల పట్ల పలువురు సానుకూలంగా తెలిపినట్లు సర్పంచ్ వేచలపు దొరబాబు తెలిపారు. వీఆర్పీ పెనగంటి శ్రీనుకు మద్దతుగా గ్రామానికి చెందిన గొర్రుపోటు సూరి అప్పారావు, కనకరత్నంతో పాటు పలువురు మహిళలు విచారణ అధికారుల ఎదుట వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అవుగడ్డ సోంబాబు వారితో వాగ్వాదానికి దిగాడు. సాక్షాత్తూ పోలీసులు, అధికారుల ఎదుటనే ఉపాధి వేతనదారులపై రంకెలేసిన సొంబాబు మీసం మెలేసి ఎవడొస్తాడో రండి చూసుకుందాం అని చాలెంజ్ విసిరినట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు. టీడీపీ నాయకుడి దురుసు ప్రవర్తనతో అధికారులు చేసేదేమీ లేక విచారణ పూర్తి చేసుకొని వెళ్లిపోయారు. విచారణకు ఏపీవో అప్పలరాజు, ఈసీ రామునాయుడు హాజరవగా, ఘర్షణలు జరగకుండా ఎ.కోడూరు ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో కలిసి చర్యలను తీసుకున్నారు.

రాములవారి ధనుస్సుకు పూజలు



ఆలయంలో శ్రీరామచంద్రమూర్తి ధనుస్సు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయ మండపంలో సోమవారం అయోధ్య రాముని ధనుస్సు, బాణాలను భక్తుల దర్శనార్థం ప్రదర్శించారు. రామజన్మభూమి అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి కోసం కేజీ బంగారం, 13 కేజీల వెండితో చెన్నైలో వీటిని రూపొందించారు. అయోధ్యకు తరలిస్తూ మార్గమధ్యంలో వీటిని స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రతిష్ట శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవ ఫౌండేషన్ నిర్వాహకులు చల్లా శ్రీనివాసశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

- పంటలు, ఆస్తుల నష్టాలపై నివేదిక తయారు చేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు



జిల్లా అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: తుఫాను తదనంతర పరిణామాలపై అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేర్వేరుగా నిర్వహించిన వివిధ శాఖ అధికారుల సమావేశంలో పలు అంశాలపై ఆమె సమీక్షించారు. పంటలు, ఆస్తుల నష్టాలపై నివేదిక తయారు చేయాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలన్నారు. మంచినీటి సరఫరా సక్రమంగా జరగాలన్నారు. వర్షాలకు విద్యుత్, తాగునీటి, రోడ్డు సౌకర్యాలు, ఇళ్లు, చెట్లు కూలిపోవడం, ఇతర అవాంతరాలపై ఆయా శాఖల సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. తోపుడు బళ్లలో విక్రయించే ఆహార పదార్థాలపై మండల కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల సప్లై విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని సూచించారు. ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయాలన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

జిల్లాలో ఉన్న ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలు బయటకు వెళ్లి మళ్లీ తిరిగి వచ్చే సమయంలో ఎవరినైనా ఎస్కార్ట్‌గా పంపాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. తల్లిదండ్రులు వస్తేనే విద్యార్థినులను బయటకు పంపాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తప్పనిసరిగా వసతి గృహాల్లో ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టళ్లలో మెనూ పక్కగా అమలు చేయాలన్నారు.

ఉత్తీర్ణత శాతం పెరగాలి

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులతో సత్ప్రవర్తనతో మెలిగేలా ఎంఈవోలు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, వేడి నీటిని అందుబాటులో ఉంచాలని ఎంఈవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, డీఈవో వెంకట లక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ ఈడీ కె.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగశిరీష, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కోఆర్డినేటర్ రూపవతి, తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని రైళ్లు రద్దు



విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో వేచి వున్న ప్రయాణికులు

తాటిచెట్లపాలెం: భారీ వర్షాల కారణంగా మంగళ, బుధవారాల్లో పలు రైళ్లు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. మంగళవారం ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-సికింద్రాబాద్(12739)గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-షాలిమర్(12774) ఏసీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్(20707/20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్(20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-పూరీ(17480) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-మహబూబ్‌నగర్-విశాఖపట్నం (12861/62) ఎక్స్‌ప్రెస్, తిరుపతి-విశాఖపట్నం(08584)స్పెషల్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమర్(12842)కోరమండల్ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-విశాఖపట్నం(12806)జన్మభూమి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖపట్నం(17016)విశాఖ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-గుంటూరు(22701) ఉదయ్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-హైదరాబాద్(12727) గోదావరి ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

4వ తేదీన రద్దయిన రైళ్లు

షాలిమర్-సికింద్రాబాద్(12773) ఏసీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-షాలిమర్(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ-విశాఖపట్నం(20806) ఏపీ ఎక్స్‌ప్రెస్, ముంబయి-భువనేశ్వర్(11019)కోణార్క్ ఎక్స్‌ప్రెస్, తాంబరం-సంత్రగచ్చి(22842) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం-హతియా(22838)ధర్తి అబా ఏసీ ఎక్స్‌ప్రెస్, కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ ఎక్స్‌ప్రెస్,

- 5వ తేదీన కొచ్చువేలి-షాలిమర్(06081) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 6వ తేదీన హౌరా-మైసూరు(22817) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 7వ తేదీన కన్యాకుమారి-హౌరా(12666)సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరునల్వేలి-పురూలియా(220606) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

దారి మళ్లించిన రైళ్లు

- 3న విశాఖపట్నం-న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా విజయనగరం, రాయగడ, టిట్లాగఢ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది.
- 3న హైదరాబాద్-షాలిమర్ (18046)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తుంది.
- 3న హైదరాబాద్-విశాఖపట్నం(12728) గోదావరి ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తుంది.



ఖాళీగా నిలిచిపోయిన రైళ్లు

నేడు విజయవాడకు వన్‌వే స్పెషల్

భారీ వర్షాల కారణంగా ఆయా స్టేషన్‌ల్లో నిలిచిపోయిన ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం విజయవాడ వరకు వన్‌వే ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖ-విజయవాడ(08581) వన్‌వే స్పెషల్ మంగళవారం మధ్యాహ్నం 12.55 గంటలకు బయల్దేరి సాయంత్రం 7.15 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ సమయాల్లో అదే స్టేషన్‌ల్లో హాల్ట్‌తో నడుస్తుంది.

'రాజకీయ కక్షతోనే పింఛన్ల తొలగింపు'



నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షన్ కోల్పోయిన దివ్యాంగులు

నర్సీపట్నం: రాజకీయ దురుద్దేశంతో అన్యాయంగా తమ పింఛన్లు తొలగించారని గొలుగొండ మండలం, పాకలపాడు గ్రామానికి చెందిన 18 మంది దివ్యాంగులు సోమవారం ఆర్డీవో కార్యాలయ ఇన్‌చార్జీ రాజ్యలక్ష్మికి ఫిర్యాదు చేశారు. సర్పంచ్ రాజాన పద్మ, ఎంపీటీసీ వై.లక్ష్మి దుర్గ నాయుడు ఆధ్వర్యంలో బాధితులు ఆర్డీవోకు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఆర్డీవో లేకపోవడంతో ఏవోకు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఏవో హామీ ఇచ్చారు. రాజకీయ కక్షతో పేదల పింఛన్లు తొలగించి వారి పొట్టకొట్టడం టీడీపీ నాయకులకు తగదని సర్పంచ్ పద్మ పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి బాధితులకు న్యాయం చేయాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధితుల తరుపున న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. 2004 నుంచి తాము పింఛన్లు పొందుతున్నామని, తమ పింఛన్లు తొలగించడం తగదని బాధితులు సర్వసిద్ధి సింహాచలం, పోతల నాగలక్ష్మి, బర్ల పెదరాజు, రుత్తల నూకరాజు, మండ్ల చిన్నమ్మలు, ఉప్పరాపల్లి సత్యవతి, అనిమిరెడ్డి గోవింద, కిల్లాడ కన్నయ్యానాయుడు, రుత్తల రాజుబాబు, దిగబోయిన సత్యనారాయణ, నల్లబెల్లి రాజేశ్వరి, పోతల అమ్మాజీ, పోలిరెడ్డి త్రినాథ్, ఇతంశెట్టి రాజులనాయుడు, రాజాన సూర్యనారాయణ, బంగారు అచ్చియ్యనాయుడు, నల్లబెల్లి వరలక్ష్మి, వారా లక్ష్మి తెలిపారు.

పాడి రైతు విషాదాంతం

- గేదెను రక్షించేందుకు చెరువులోకి దిగి నీటిపాలు



చెరువులో మునిగి మృతి చెందిన గేదె



గేదెను కాపాడబోయి మరణించిన రైతు

రోలుగుంట: తనకు ఆధారంగా నిలిచిన గేదె నీటిపాలవుతుంటే చూడలేకపోయాడా పాడి రైతు.. గేదెను రక్షిద్దామని తానూ చెరువులోకి దిగాడు. ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన రోలుగుంట మండలం జె.పి.అగ్రహారంలో చోటు చేసుకుంది. సుర్ల అచ్చియ్యనాయుడు సోమవారం తన పాడి గేదెను మేత కోసం పొలంలోకి తీసుకెళ్లాడు. అది మేత మేస్తూ సమీప చెరువులో దిగింది. ఈ చెరువు నీటితో నిండి ఉండడంతో గేదె ప్రాణాపాయ పరిస్థితికి చేరుకుంది. తనకు ఆధారమైన పాడి గేదె ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో అచ్చియ్యనాయుడు కూడా నీటిపాలయ్యాడు. ఆయన మృతి చెందిన విషయాన్ని భార్య రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎల్.సురేష్ కేసు నమోదు చేసి సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. గేదె కాళ్లకు, మెడకు తాడుతో బంధం వేయడంతో చెరువులోకి దిగి బయటకు రాలేక నీట మునిగి చనిపోయిందని, గేదెను రక్షించేందుకు నీటిలోకి దిగిన అచ్చియ్యనాయుడు ఈత రాక మృతి చెందినట్టు విచారణలో తేలిందని ఎస్సై విలేకరులకు వివరించారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించినట్టు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు. అచ్చియ్యనాయుడికి పశువులంటే ప్రాణమని, ఎప్పుడైనా వాటికి రోగాలు వస్తే విలవిలలాడిపోయేవాడని గ్రామస్తులు చెప్పారు.

క్లుప్తంగా

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు



కనకమహాలక్ష్మి వీధిలో గణేష్ ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్న చలువ పందిరి

కశింకోట: వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. కశింకోటలోని ప్రతి వీధిలోనూ యువకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే చలువ పందిళ్లు నెలకొల్పుతున్నారు. గవరపేట, మేదర వీధి, కస్పావీధి, కనకమహాలక్ష్మి వీధి, సలాది వీధి, ద్వారపు రెడ్డి వీధి, పందిరి వీధి, కోమటి వీధి, వేణుగోపాలస్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నారు. బయ్యవరం, తాళ్లపాలెం, ఎఎస్ పేట, కన్నూరుపాలెం, తీడ, నరసింగబిల్లి, చింతలపాలెం, నూతలగుంటపాలెం, సోమవరం, తేగాడ, వెదురుపర్తి, కొత్తపల్లి, బుచ్చియ్యపేట తదితర గ్రామాల్లోనూ గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కశింకోటలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కశింకోట: స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం(శివాలయం) ఆవరణలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వాగులో పడి చూడిగేదె మృతి



కశింకోట: విసన్నపేటలో మేత కోసం వెళ్లిన చూడి గేదె కొండ వాగులో పడి మృతి చెందింది. గత నెల 31న గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లిన గేదె ఇంటికి రాలేదు. అప్పటి నుంచి వెదకగా సోమవారం ఇక్కడ వాగులో గేదె కళేబరం బయట పడింది. దీని ఖరీదు రూ.90 వేలు ఉంటుందని, తమ జీవనాధారం కోల్పోయామని బాధితురాలు తూరిబిల్లి దుర్గ కన్నీరుమున్నీరైంది.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 16 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,830	4,830
రెండో రకం	3,550	3,550
మూడోరకం	--	--

అనకాపల్లి సినిమాలు

గబ్బర్ సింగ్	: రాజా
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
శ్రీలక్ష్మీనరసింహ (జ్యోతి)జామి	: షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మారుతీనగర్ సుబ్రమణ్యం	: శ్రీసత్య
11 డిమోంటి కాలని	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 242 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



అనకాపల్లి: సతకంపట్టు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కొణతాల మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు



అనకాపల్లి: గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అభిమానులు, బాలసుబ్రహ్మణ్యం



కశింకోటలో మహానేత డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి నాయకుల నివాళులు



అనకాపల్లి: పూడిమడక జాతీయ రహదారిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్



కశింకోట: చింతలపాలెంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ రాము

మహానేత వైఎస్సార్

- వాడవాడలా రాజన్న వర్ధంతి
- పలు చోట్ల సేవా కార్యక్రమాలు

వాడవాడలా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని మనసారా స్మరించుకున్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న రాజన్న పాలనను వేనోళ్లలా కీర్తించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని 15వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి: పట్టణంతోపాటు మండలంలోని పలు ప్రాంతాల్లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. స్థానిక గవరపాలెం కరెంట్ ఆఫీస్ వద్ద రాజశేఖర్ రెడ్డి అభిమానుల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి కొణతాల బాలసుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఐదు సంవత్సరాల మూడు నెలల పాలన చిరస్మరణీయమన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చిందంటే ఆ ఘనత వైఎస్సార్‌దే అన్నారు. ప్రాజెక్టు పూర్తవ్వక పోయినా కుడి, ఎడమ కాలువల ద్వారా ఈరోజు రైతులు పంటలు పండించుకుంటూ ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రాజశేఖర్‌రెడ్డి నామకరణం చేయాలని కోరారు. పేద బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు అద్భుతమన్నారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్సుమెంటు, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్, అలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి అభిమానులు పీలా కొండ వీరునాయుడు, బుద్ద రాజేష్, పీలా నాని, సుజీ, దాడి మురళి, లక్ష్మణ్, పెంటకోట సంతోష్, మద్దాలు సంతోష్, కోసూరి వెంకటేశ్వరరావు, కొణతాల సంతోష్ , పెట్ల శ్రీను, ద్రాక్షారపు పరదేశి తదితరులు పాల్గొన్నారు.

80వ వార్డులో....

గవరపాలెం 80వ వార్డు సతకంపట్టులో మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కె.ఎం.నాయుడు నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను కొనసాగించాలంటే, 2029 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గెలుపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ

తుమ్మపాల: మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో పొందిన సహాయాన్ని మర్చిపోకుండా వైఎస్సార్ పేరుతో సేవ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పీడీ గాంధీ అన్నారు. తుమ్మపాలలో వైఎస్సార్ అభిమాని పూడి సాంబ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పీడీ గాంధీ, ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. పీడీ గాంధీ మాట్లాడుతూ వైఎస్సార్ శ్రీకారం చుట్టిన ఆరోగ్యశ్రీ పథకంతో 15 సంవత్సరాల క్రితం ఉచితంగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేసుకున్న పూడి సాంబ ఆ సహాయాన్ని మర్చిపోకుండా తన



అనకాపల్లి: పెరుగుబజార్ జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్, దంతులూరి దిలీప్‌కుమార్, జాజుల రమేష్

సొంత ఖర్చులతో ఏటా వైఎస్సార్ వర్ధంతి రోజున పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పన్నీరు కొండలరావు, వైఎస్సార్ సేవాదళ్ నాయకులు సత్యనారాయణ, పెంటకోట రాజు, రైతు సంఘం అధ్యక్షుడు పీలా బుజ్జి పాల్గొన్నారు.

కశింకోట మండలంలో..

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట పంచాయతీలోని ప్రధాన రహదారిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, పార్టీ యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు. ఉగ్గినపాలెంలో ఎంపీపీ కలగా లక్ష్మి వైఎస్సార్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. కన్నూరుపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. చింతలపాలెంలో సర్పంచ్ కొట్టి రాము వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జమాదుల పాలెంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు.



తుమ్మపాల: పేదలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆస్పత్రి కార్మికుల జీతాలు చెల్లించాలని డిమాండ్

అనకాపల్లి: ఎన్టీఆర్ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి ఐదు నెలల బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నూకరాజు, సంతోష్ మాట్లాడుతూ సెక్యూరిటీ సూపర్‌వైజర్లకు కాంట్రాక్టరు ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించలేదన్నారు. పెరిగిన వేతనాలు సైతం ఇవ్వకుండా వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నారని వాపోయారు. ఈ నెల 15వ తేదీలోగా కార్మికుల జీతాలు చెల్లించకపోతే సమ్మెకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరప్రసాద్, నారాయణ, అడవి రాజు, పోలారావు, రాం ప్రసాద్, వినోద్, వరలక్ష్మి, సన్యాసిరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మట్టి గణపతులను పూజించాలి



మట్టి విగ్రహాలను పూజించాలని కోరుతూ ప్రదర్శన

కశింకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని కోరుతూ సోమవారం వెదురుపర్తిలో విద్యార్థులు, ప్రజలు ప్రదర్శన నిర్వహించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 'మట్టి వినాయకుడు పర్యావరణ పరిరక్షకుడు' అంటూ నినాదాలు చేశారు. సుమారు 500 గణేష్ ప్రతిమలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి ఎ.వి.ఎన్. మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

- సమ్మె నాటి హామీలను నెరవేర్చాలని డిమాండ్

అనకాపల్లి: గత సమ్మె సమయంలో జీవీఎంసీ అధికారులు మినిట్స్ ప్రకారం పారిశుధ్య, నీటిసరఫరా, క్లాప్ డ్రైవర్లు, లోడర్లు, వర్కర్స్ అండ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని, లేని పక్షంలో సమ్మెకు దిగే పరిస్థితి వస్తుందని మున్సిపాల్ కాంట్రాక్టు కార్మికుల ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జోన్ గౌరవాధ్యక్షులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేమలు చేయని పక్షంలో ఈ నెల 16వ తేదీ తర్వాత సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. జోనల్ కార్యాలయంలోని అన్ని విభాగాల్లో కారుణ్య నియామకాల కింద ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, విధుల నిర్వహించే కార్మికులు తగిన పరికరాలు ఇవ్వాలని, బకాయిపడ్డ హెల్త్ అలవెన్స్ చెల్లింపు, జీవీఎంసీ విలీన గ్రామాల్లో కార్మికుల బకాయిలు, పీఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని, పట్టణ జనాభాకు తగ్గట్టుగా కార్మికులను పెంచాలని, జీవో నంబర్ 36 ప్రకారం క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 చెల్లించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు యేసు రాజు, నిమ్మకాయల అజయ్, సంతోష్, బి.రాము, శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి - చోడవరం రోడ్డుపై గుంతలు

- వర్షపు నీరు నిలిచి వాహనచోదకుల తీవ్ర ఇక్కట్లు

తుమ్మపాల: నిత్యం వందల సంఖ్యలో వాహనచోదకులు రాకపోకలు సాగించే అనకాపల్లి - చోడవరం రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు చినబాబుకాలనీ వద్ద రోడ్డుపై గుంతలో నీరు చేరింది. రోడ్డంతా జలమయమైంది. వాహనదారుల రాకపోకలు కష్టతరమయింది. గుంతల్లో వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానికులు స్పందించి ఒక వైపు రోడ్డుకు అడ్డంగా వాహనం, ముళ్లకంపలు పెట్టి మరోవైపుకు వాహనాల రాకపోకలను మార్చారు. సుమారు 200 మీటర్ల వరకు రోడ్డుపై నిలిచిపోయిన నీటిని మోటారు యంత్రం సహాయంతో బయటకు తోడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించలేదని, చేసేదేమిలేక తామే మిషన్‌తో నీటిని తోడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. జంక్షన్‌లో నీరు నిలిచిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కుడి నుంచి ఎడమ రోడ్డును తవ్వి కాలువకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై నీటిని మోటారుతో తోడుతున్న స్థానికులు

వరి సాగులో యాజమాన్య పద్ధతులు



బయ్యవరంలో పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారుల బృందం

కశింకోట: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు రైతులకు సూచించారు. మండలంలోని బయ్యవరం, వెదురుపర్తి గ్రామాల్లో ఖరీఫ్ వరి నాట్లు, నారుమళ్లను వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో కూడిన బృందంతో కలిసి సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్య పద్ధతుల్లో భాగంగా వరి ఆకు ఎదుగుదలకు 5 సెంట్ల మడికి కిలో యూరియా, కిలో పొటాష్ ఎరువులు వేసుకోవాలన్నారు. ఉడిచిన వరి నాట్లకు ఎకరాకు 20 కిలోల వంతున యూరియా, పొటాష్ ఎరువు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. రామారావు, ఆర్ఎఆర్ఎస్ ఏడీఏ ఆర్. ముకుందరావు, పెథాలజీ శాస్త్రవేత్త చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదినం

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కేక్ కట్ చేశారు. అనంతరం శారదానది ఒడ్డున అన్నమయ్య విగ్రహం వద్ద సోమవారం ఆయన మొక్కలను నాటారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు..

కశింకోట: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణ మండపంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సత్యదేవ్ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు ఏసు ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బుదిరెడ్డి చిన్న, పావాడ కామరాజు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట పంచాయతీలో రోజూ తాగునీరు

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో ఇక నుంచి రోజూ రెండు పూటల కుళాయిల నుంచి మంచినీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కశింకోటలో పర్యటించి తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షితనీటి పథకం-3 వినియోగంలోకి తీసుకు రాకపోవడం పట్ల పంచాయతీ కార్యదర్శి రమేష్‌పై ఆగ్రహించారు. దీనివల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యుత్ కనెక్షన్ లేదని కార్యదర్శితోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని బదులిచ్చారు. దీంతో ఈపీడీసీఎల్ స్థానిక డివిజన్ అధికారులతో ఫోన్లో మాట్లాడి కనెక్షన్ ఇవ్వాలని, అందుకయ్యే చార్జీ పంచాయతీ నుంచి చెల్లిస్తారన్నారు. సంతలో దుకాణాలను, కుళాయి కనెక్షన్లు అడ్డగోలుగా ఇచ్చారనే ఆరోపణలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంపై కార్యదర్శిని ప్రశ్నించి ఆగ్రహించారు. కుళాయిలకు అక్రమంగా మోటార్లు అమర్చిన వారికి నోటీసులు ఇచ్చి 15 రోజుల్లోగా తొలగించుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు బుదిరెడ్డి చిన్న, పావాడ కామరాజు, టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు నడిపల్లి సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల కబ్జాలను అడ్డుకోండి

- చినముషిడివాడలో కార్పొరేటర్ భూ ఆక్రమణపై చర్యలు తీసుకోండి
- పెందుర్తి తహసీల్దార్‌కు సీపీఐ నేతల వినతి

పెందుర్తి : పెందుర్తి రెవెన్యూ మండల పరిధిలో టీడీపీ నాయకుల భూ కబ్జాలను అధికారులు అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుపిల్ల పైడిరాజు డిమాండ్ చేశారు. చినముషిడివాడలోని సర్వే నంబర్ 113లో టీడీపీ కార్పొరేటర్ శానాపతి వసంత భర్త శంకర్రావు చేస్తున్న భూ కబ్జాను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. పైడిరాజు మాట్లాడుతూ ఇక్కడ భూ కబ్జాపై రెవెన్యూ మంత్రి, రెవెన్యూ కార్యదర్శికి నేరుగా వివరాలతో సమాచారం అందించామన్నారు. దీనిపై చర్యలకు వారు సానుకూలంగా స్పందించినా జిల్లా, స్థానిక రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సర్వే నంబర్ 185లోని బర్డన్‌నగర్‌లో ఏళ్ల తరబడి నివసిస్తున్న వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని కార్పొరేటర్ వసంత, భర్త శంకర్రావు పేదలపై ప్రతాపం చూపుతున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి నివసిస్తూ, అన్ని పత్రాలు ఉన్న వారిపై అధికారులను ఉసిగొల్పి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేటర్, ఆమె భర్తపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే తమ పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

చికెన్ షాపుల నిర్వాహకులకు నోటీసులు

సబ్బవరం : చికెన్ షాపుల్లోని వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రమేష్ నాయుడు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న చికెన్, మటన్, చేపల దుకాణాలను సిబ్బందితో కలిసి సోమవారం ఆయన తనిఖీ చేశారు. నిబంధనల మేరకు సక్రమంగా నిర్వహించని దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో కోళ్ల వ్యర్థాల నిర్వహణలో సరైన ప్రమాణాలు పాటించాలని సూచించారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చికెన్, చేపల వ్యర్థాలను గ్రామాలకు దూరంగా తీసుకెళ్లి నిప్పు పెట్టాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ మహేష్, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు పాల్గొన్నారు.